

# సంస్కృతి

కె. ఉషారాణి

సుజాత రేపు స్టేట్స్‌కి వెళ్ళిపోతోంది. తనని ఆఖరి సారిగా కలవాలి. మళ్ళీ ఎప్పుడొస్తుందో ఏమో? అసలు వస్తుందో లేదో కూడా అనుమానమే అనుకుంటూ సుజాత ఇంటికి బయలుదేరాను.

కాసెట్ల మీదున్న పేర్లని చూస్తూ మళ్ళీ అడిగాను "ఇవన్నీ నీ కెందుకు?"

"స్టేట్స్‌కి వెడుతూ తీసుకువెళ్ళకపోతే ఎలాగే?" అని ఎదురు ప్రశ్నించింది.

నన్ను వాకిట్లో చూస్తూనే "రావే, నీ కోసమే ఎదురుచూస్తున్నాను" అని ఆప్యాయంగా ఆహ్వానించింది.

చాలాసేపు కాలేజీ కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాము.

"సుజా! ఆ కాస్త సర్దేసుకుని కూర్చోరాదూ" అన్నది ఆంటీ.

"అలాగే అమ్మా!" అని "రావే పాకింగ్ చేసుకుంటూ మాట్లాడుకుందాం" అని గదిలోకి తీసుకు వెళ్ళింది.

"ఇంకా పాకింగ్ చేసుకోవడంలోనే వున్నావా? తెల్లవారితే ప్రయాణం."

"అంతా అయిపోయింది, ఇదుగో ఈ కాస్తే వుంది" అన్నది.

"ఇవన్నీ ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఈ రోజు పొద్దునే షాపింగ్ చేసి కొన్నాను!" పట్టుచీరల అట్ట డబ్బాలు నా ముందుకి తోస్తూ "చూడు" అన్నది.

ఇక్కడ ఈ దేశంలో పుష్పవ్వడు వాటిలో లేని అవసరం విదేశాల్లో ఏమై వుంటుందో నా కర్థం కాలేదు.

శాస్త్రీయ సంగీతం అంటే సరిగమలతో మొదలవుతుందనే విషయం కూడా సరిగ్గా తెలియని సుజాతకి ప్రముఖులు పాడిన సంగీతం, గజల్స్ కాసెట్లు ఎందుకో?

పొరపాటున శాస్త్రీయ సంగీతం తన చెవిన పడితే "ప్రాణాలు తీసే పాడు సంగీతం ఎలా వింటావే బాబూ? నేనున్నంత సేపు మాత్రం కట్టెయ్యి" అని రేడియో నోరు నొక్కేసేది.

ఒకసారి కాలేజీ ఫంక్షన్‌లో భారతమాత పోర్షన్‌కి బాగా సూటవుతుందని మేడం సుజాతని సెలక్ట్ చేసింది. అసలు చీరలంటేనే చిటపటలాడే సుజాత ఆ పాత్రకి పట్టుచీర కట్టుకోవాలంటే చేసిన హంగామా నా కిప్పటికీ గుర్తు.

ప్రతి చర్యలో ప్రతి మాటలో విదేశాలను అనుకరిస్తూ వుండే సుజాతకీ, నాకూ అన్ని విషయాల్లో అభిప్రాయభేదాలున్నా, సుజాతలో నాకు నచ్చిన విషయం ఒక్కటే. మనసులో ఒకటి పెట్టుకుని పైకి మరొకటి మాట్లాడే తత్వం కాదు. ఉన్నదున్నట్టు మనసు ముందు పరిచినట్టు స్పష్టంగా మాట్లాడుతుంది. మా ఇద్దరి మధ్యా స్నేహం బలపడడానికి అదే కారణం కావచ్చు.

సుజాతవాళ్ళది మధ్యతరగతి కుటుంబమైనా అందం విషయంలో సుజాతకి దేవుడు న్యాయమే చేసాడు. అందుకే స్టేట్స్‌లో వుండే ఇంజనీరు కట్నం తీసుకోకుండా సుజాతని పెళ్ళి చేసుకున్నాడు. తన ఊహలకు వాస్తవ రూపం వచ్చినందుకు నేనెంతో సంతోషించాను.

"ఏమిటే ఆలోచిస్తూ ఏదో లోకంలోకి వెళ్ళిపోయావు" అన్నది నన్ను కుదుపుతూ. అప్పటికే నా చేతుల్లోంచి చీరలు తీసుకుని సర్దడం కూడా పూర్తయింది.

"ఇవన్నీ నాకు పడవు. అక్కడికి తీసుకువెళ్ళి ఏం చేసుకుంటానని కదూ నీ డౌట్. చీరలూ గాజులూ జస్ట్ ఫ్యాన్సీగా వాడుకోవడానికి. ఈ కాసెట్లూ అవీ అంటావా? మన దేశం గొప్పతనం అక్కడి వాళ్ళకి చాటడానికి. నీ డౌట్ క్లియర్ అయినట్టేనా?" అన్నది నవ్వుతూ.

సుజాత అంతర్యం నా కిప్పుడర్థమయింది. తనకి ఏ దేశ సంస్కృతిపైనా గౌరవం లేదు. ఈ దేశంలో వుండి ఇతర దేశాల్ని అనుకరిస్తుంది. ఇతర దేశాల్లో మన సంప్రదాయాల్ని అనుసరిస్తుంది. అంతేగానీ ఏ సంప్రదాయం పైనా సదభిప్రాయం లేదు.

మన దేశంలో గౌరవింపబడే సంస్కృతీ సంప్రదాయాల్ని అదే గౌరవంతో మరో దేశంలోకి తీసుకువెళితే నేనెంతో ఆనందించేదాన్ని. అలా కాక కేవలం 'ఫ్యాన్సీ'గా మరో దేశంలోకి దిగుమతి చెయ్యడాన్ని అంగీకరించలేకపోతున్నాను. అంతకన్నా మన సంస్కృతి మనకే వదిలిపెడితే ఎంత బాగుండు అనిపించింది. మనమూ మన ఆలోచన ఎటు వైపు వెళుతోంది? 'తిరోగమనం' అంటే ఇదేనా?

మా స్నేహాన్ని చిరకాలం ఒక తీయని జ్ఞాపకంలా మిగుల్చుకోవాలనుకున్న నేను, ఈ చేదు నిజాన్ని ఎందుకో అంగీకరించలేక 'వస్తా సుజా' అని ఇంటిదారి పట్టాను.